అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people



# సత్వర న్యాయం అందించాలి

- రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలి
- పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నేర సమీక్ష సమావేశంలో వరంగల్ సీపీ ఎన్ శ్వేత
- రూ.50 లక్షల విలువైన 352 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

04

బుధవారం 15, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 148 | పేజీలు : 05 | వెల ₹5

# డేట్ ఫిక్స్

## 2028 జూన్ 2 వరకు ఎయిర్‌పోర్ట్ రెడీ

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై చర్చ
- ఎంఆర్వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరిన సీఎం

**అక్షరదర్బార్, న్యూఢిల్లీ:**

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ఆ శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం వివరించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమల వల్ల వరంగల్ నగరం పారిశ్రామికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందుకే ఈ విమానాశ్రయంలో ఎంఆర్వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరారు.

- కాకతీయ వైభవంతో వరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్లు : కేంద్రమంత్రి
- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని ప్రకటన
- మూడు వారాల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- భూసేకరణ వేగంగా పూర్తి చేసినందుకు తెలంగాణకు అభినందనలు

3




### అధిక ధరలకు అమ్మితే

# దుకాణాలు సీజ్

- యూరియా విక్రయాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక
- పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

4






# సింగరేణిని బలోపేతం చేస్తాం

- తాడిచెర్ల-2 కేటాయింపే ఇందుకు నిదర్శనం
- కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- కేటీకే-8 గనిలో బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'

3



# పాలనలో 'కృత్రిమ మేధస్సు'

- ప్రభుత్వ సేవల నాణ్యతకు 'ఏఐ' మంత్రం
- అధికారులకు చాట్‌జీపీటీ, గూగుల్ నోట్‌బుక్ ఎల్ఎమ్‌లపై ప్రత్యేక శిక్షణ
- ఏఐతో కొద్ది గంటల్లోనే మున్సిపల్ డీపీఆర్ తయారీ
- లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము ఆదా చేసిన వైనం
- ఏఐ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదు..
- పనిని వేగవంతం చేసే అస్త్రం.. కలెక్టర్

3



## కౌలు రైతులకు దక్కని సంక్షేమ పథకాలు

**అక్షరదర్బార్, నర్సంపేట :**

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న కౌలు రైతుల గుర్తింపు కాలగర్భంలో కలిసినట్లేనని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నర్సంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతుల్లో 25 లక్షల మంది కౌలు రైతులేనని, అయినా పాలకుల నిర్లక్ష్యం వల్ల వారు బహుముఖ దోపిడీకి గురవుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011 చట్టం ప్రకారం ఎల్ఈసీ కార్డులు ఇచ్చి రుణాలు అందించగా, ప్రస్తుతం తెలంగాణలో ప్రతి ఏటా మే నెలలో జరగాల్సిన గ్రామసభల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను విస్మరించి, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు బీమా వర్తింపజేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగుదారులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

## ఓటర్ల ఎస్ఐఆర్ ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

○ ఆర్డీఓ వెంకన్న

**అక్షరదర్బార్, పరకాల :**

పరకాల మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ఫారమ్‌ల ఆన్‌లైన్ ప్రాసెసింగ్ పనులను రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరకాల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ఆన్‌లైన్ నమోదు పురోగతిపై సమీక్ష జరిపారు. నిర్ణీత గడువులోగా ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను విజయవంతంగా ముగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, బీఎల్ఓలు, ఎన్నికల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

చిట్యాలలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

అక్షరదర్బార్, చిట్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వమని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైన్‌పాక గ్రామానికి చెందిన మంద జ్యోతి, కలువచర్ల సుశీల, దేవర భీమక్కలకు ఒక్కొక్కరికి రూ. 1,00,116 చొప్పున చెక్కులను నైన్‌పాక సర్పంచ్ నక్క భాస్కర్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ తూకుంట్ల వసంతరావు, సర్పంచ్ తౌటం లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.





## బ్యాంకు బయట నమ్మించి మహిళ నుంచి 3 తులాల బంగారం అపహరణ

అక్షరదర్బార్, నర్సంపేట : పని ఉన్నట్లు నటించి ఓ మహిళ నుంచి మూడు తులాల బంగారు నగలను ముగ్గురు మహిళల ముఠా అపహరించిన సంఘటన నర్సంపేట పట్టణంలోని కెనరా బ్యాంకు వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగింది. పర్వతగిరి మండలం ముంజకుంట తండాకు చెందిన బానోతు నీల బ్యాంకులో తాకట్టు పెట్టిన నగలను విడిపించుకుని బయటకు వచ్చింది. ఆమె భర్త పక్కనే ఉన్న ఏటీఎంకు వెళ్లగా, ముగ్గురు గుర్తుతెలియని మహిళలు నీలను మాటల్లో దించి, ఆమె చేతిలోని కవరును బ్లేడుతో కత్తిరించి నగలను కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నర్సంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కళాశాలల బంద్ విజయవంతం

**వేల్పుల రాజకుమార్**

అక్షరదర్బార్, చిట్యాల : ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఏబీవీపీ ఇచ్చిన పిలుపు మేరకు చిట్యాల మండలంలో కళాశాలల బంద్ విజయవంతమైంది. చిట్యాల నగర కార్యదర్శి ముష్కే అజయ్ ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభిజ్ఞ గౌడ్, వితేష్, అభిరామ్ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు

అక్షరదర్బార్, చిట్యాల : మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలకు చిట్యాల టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్ మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన కె. వీరేంద్ర చారి (6వ తరగతి), బి. భార్గవ్ తేజ (9వ తరగతి), ఎన్. శ్రీశేషు (ఇంటర్ ద్వితీయ సంవత్సరం), డి. ప్రణయ్ (ఇంటర్ ద్వితీయ సంవత్సరం) ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు యు. అశోక్‌ను ప్రిన్సిపాల్ కొనియాడారు.



## స్వాతంత్ర్య సమరయోధుడు చిన్న మల్లారెడ్డి కన్నుమూత

**మున్సిపల్ చైర్మన్ సునీల్ నివాళి**

అక్షరదర్బార్, పరకాల : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చందుపట్ల రాఘవరెడ్డి తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు చందుపట్ల చిన్న మల్లారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మంగళవారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్న మల్లారెడ్డి దేశ స్వాతంత్ర్య పోరాటంలో అందించిన సేవలను స్మరించుకుంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బండి శ్రీధర్, కొయ్యడ శ్రీనివాస్, సుదమల్ల రమేష్, బొచ్చు సల్మాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఒంటెరు శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.





## 18 నెలల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

**హైర్ వెహికల్స్ అసోసియేషన్**

అక్షరదర్బార్, ములుగు : అద్దె వాహనాల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ హైర్ వెహికల్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ములుగు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాహనాల అద్దె బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. 2017లో నిర్ణయించిన అద్దె చార్జీలనే ఇప్పటికీ ఇస్తున్నారని, డీజిల్, నిర్వహణ ఖర్చులు పెరిగినందున నెలవారీ అద్దెను రూ. 34 వేల నుండి రూ. 55 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శరత్ కుమార్, రాజేశ్ కుమార్, భద్రయ్య పాల్గొన్నారు.

## రేఖంపల్లి స్కూల్‌కు మధ్యాహ్న భోజన పాత్రలు అందజేసిన సర్పంచ్

అక్షరదర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలం రేఖంపల్లి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థుల కోసం గ్రామ సర్పంచ్ కొలుగూరి సుజాత 40 మందికి సరిపడా వంట పాత్రలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతాజి, ఉపాధ్యాయుడు రాజ్ కుమార్, అంగన్వాడీ టీచర్ స్వరూప పాల్గొన్నారు.



## పంచాయతీలపై విద్యుత్ బిల్లుల ఒత్తిడి మానుకోవాలి

○ సర్పంచ్ మోడెం శ్రీలత

అక్షరదర్బార్, దుగ్గొండి : గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా, విద్యుత్ బిల్లులు చెల్లించాలని సర్పంచులు, కార్యదర్శులపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలని తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత కోరారు. సర్పంచులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రభుత్వం రూపాయి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. పంచాయతీ అకౌంట్లలో ఉన్న పన్నుల డబ్బులను కూడా సీజింగ్‌లో పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని, అంతవరకు ఒత్తిడి చేసే విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.



# డేట్ ఫిక్స్

## 2028 జూన్ 2 వరకు ఎయిర్‌పోర్ట్ రెడీ



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై చర్చ
- ఎంఆర్వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరిన సీఎం
- కాకతీయ వైభవంతో వరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్లు.. కేంద్రమంత్రి
- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని ప్రకటన
- మూడు వారాల్లో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- భూసేకరణ వేగంగా పూర్తి చేసినందుకు తెలంగాణకు అభినందనలు

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ఆ శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం వివరించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమల వల్ల వరంగల్ నగరం పారిశ్రామికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందుకే ఈ విమానాశ్రయంలో ఎంఆర్వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్ హాలింగ్), ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరారు.

### - 2028 జూన్ 2 నాటికి ప్రారంభోత్సవం

"వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే భూసేకరణ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కానుకగా 2028, జూన్ 2 నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. అలాగే, వరంగల్ చారిత్రక నేపథ్యాన్ని చాటిచెప్పేలా, కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా ఎయిర్‌పోర్ట్ డిజైన్లు ఉండాలని సూచించగా కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారు.

### ఆదిలాబాద్‌లో డిఫెన్స్ కమ్ సివిల్ ఎయిర్‌పోర్ట్:

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ (డిఫెన్స్) ఆధ్వర్యంతో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన అదనపు భూమిని సేకరించి ఇస్తామని స్పష్టం చేశారు. వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్‌లోనూ ఎయిర్ కార్గో వసతులు, అలాగే రెండు చోట్లా విమాన శిక్షణా సంస్థలు (ఎఫ్టీవో) నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

### కేంద్ర మంత్రి ప్రశంస

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను అత్యంత వేగంగా పూర్తి చేసి చరిత్ర సృష్టించిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. భూసేకరణపై వేగంగా స్పందించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మూడు వారాల్లో ఎయిర్ పోర్ట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు కె రామకృష్ణారావుతో పాటు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలనలో 'కృత్రిమ మేధస్సు'

- ప్రభుత్వ సేవల నాణ్యతకు 'ఏఐ' మంత్రం
- అధికారులకు చాట్‌జీపీటీ, గూగుల్ నోట్‌బుక్ ఎల్ఎమ్‌లపై ప్రత్యేక శిక్షణ
- ఏఐతో కొద్ది గంటల్లోనే మున్సిపల్ డీపీఆర్ తయారీ
- లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము ఆదా చేసిన వైనం
- ఏఐ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదు..
- పనిని వేగవంతం చేసే అస్త్రం :కలెక్టర్



**అక్షరదర్బార్, హనుమకొండ:**

ప్రభుత్వ పరిపాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం ద్వారా కార్యనిర్వహణను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో టీ–ఫైబర్ సహకారంతో ప్రభుత్వ అధికారుల సామర్థ్యాభివృద్ధి లక్ష్యంగా "పరిపాలన సామర్థ్య పెంపునకు కృత్రిమ మేధస్సు (ఏఐ)" అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

### ఏఐతో పని సులభం.. సమయం ఆదా

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ పరిపాలనలో వినియోగించడం కాలానుగుణ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. రోజువారీ కార్యాలయ కార్యకలాపాల్లో ఏఐ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగిస్తే తక్కువ సమయంలో నాణ్యమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఒక అధికారిక లేఖను రూపొందించడానికి గతంలో ఎక్కువ సమయం పట్టేదని, అయితే ఏఐ సాధనాల సహాయంతో అదే పనిని కొద్ది నిమిషాల్లో పూర్తి చేయవచ్చని అన్నారు. ఆకర్షణీయమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, అధికారిక నివేదికలు, సమావేశాల మినిట్స్, పత్రాల సంక్షిప్తీకరణ, అనువాదాలు వంటి అనేక పనులను సులభంగా నిర్వహించవచ్చని వివరించారు. ఏఐ అనేది మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని, పనిని వేగవంతం చేసే సహాయక సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు.

### ఏఐ ద్వారా నిధుల ఆదా..

ఇటీవల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్స్ వెండింగ్ జోన్ ఏర్పాటు కోసం రూపొందించాల్సిన డీపీఆర్ కు కన్సల్టెన్సీ సంస్థలు భారీ మొత్తంలో రుసుము కోరాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఆ సమయంలో ఏఐ సాధనాల ద్వారా అవసరమైన సమాచారాన్ని విశ్లేషించి ఉచితంగా డీపీఆర్‌ను రూపొందించగలిగామని తెలిపారు. దీనివల్ల సాధారణంగా వారం రోజుల సమయం పట్టే పనిని కొద్ది గంటల్లో పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులను కూడా ఆదా చేయగలిగామని వివరించారు.

### చాట్‌జీపీటీ, గూగుల్ నోట్‌బుక్ ఎల్ఎమ్‌లపై శిక్షణ

ఈ శిక్షణలో భాగంగా చాట్‌జీపీటీ, గూగుల్ నోట్‌బుక్ ఎల్ఎమ్, క్లాడ్ తో పాటు మొత్తం 15 అధునాతన ఏఐ ఆధారిత ఉత్పాదకత సాధనాల వినియోగంపై శిక్షణ అందించారు. లేఖల తయారీ, ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదం, వచనాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లుగా మార్చడం, డేటా విశ్లేషణ వంటి రోజువారీ కార్యాలయ పనులను స్వయంచాలకంగా నిర్వహించే విధానాలపై పాల్గొన్న అధికారులకు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. శిక్షకులు వాసుదేవన్ నటరాజన్, ధీరజ్ ఏఐ సాధనాల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఈడీఎం శ్రీధర్, కలెక్టరేట్ ఏవో గౌరీశంకర్, పలువురు జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ సవరణ దరఖాస్తు ఫారాలను అందజేసిన కొక్కిరాల రాకేశ్‌రావు

అక్షరదర్బార్, పరకాల : ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా స్థానిక బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) అవసరమైన దరఖాస్తు ఫారాలను కొక్కిరాల రాకేష్‌రావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సమాచారంతో సహకరించాలని, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి వెంకటేష్, నాగరాజు, కృపేందర్‌రెడ్డి, బీఎల్ఓ రజిత పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న ప్రమాదకర విద్యుత్
# తీగలను తక్షణమే తొలగించాలి

**మారపెల్లి మల్లేష్**



అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రం నుండి రంగాపూర్ వరకు 17 ఇళ్లపై నిరుపయోగంగా ఉన్న 33/11కేవీ కరెంట్ తీగలను తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిట్యాలలో మాట్లాడుతూ గతంలో ఈ తీగల వల్ల విద్యుత్ షాక్‌తో ముసాపూర్ రమేష్ అనే వ్యక్తి మృతి చెందాడన్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ తీగలను తొలగించాలని కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని, వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకముందే వీటిని వెంటనే తొలగించాలని కోరారు.

# సింగరేణిని బలోపేతం చేస్తాం

- తాడిచెర్ల2 కేటాయింపే ఇందుకు నిదర్శనం
- కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- కేటీకే8 గనిలో బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'

అక్షరదర్బార్, భూపాలపల్లి: దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణిని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే–8 సింగరేణి గనిలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన 'సింగరేణి భరోసా యాత్ర' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమంపై కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.

### రూ. 9 వేల కోట్ల బకాయిలు ఇవ్వాలి

గత ప్రభుత్వాల వైఫల్యాలు, విధానాల వల్ల సింగరేణి కార్మికుల్లో అభద్రతాభావం పెరిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలక ప్రభుత్వ రంగ సంస్థగా బలోపేతం చేయాల్సింది పోయి, గత పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని విమర్శించారు. తెలంగాణ జెన్‌కో సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.9,000 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భారీ బకాయిల వల్ల సంస్థపై అనవసర ఆర్థిక భారం పడుతోందన్నారు. అలాగే డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధుల వినియోగంపై ప్రభుత్వం పారదర్శకత పాటించాలని కోరారు.

### తాడిచెర్ల-2 కేటాయింపు కేంద్ర చిత్తశుద్ధికి నిదర్శనం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని, ఇది కార్మికుల సంక్షేమంపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని మరింత బలోపేతం చేసి, పారదర్శక పాలనతో సంస్థను తిరిగి లాభాల బాటలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

### కార్మికుల హక్కుల కోసం బీజేపీ పోరాడుతుంది

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు మాట్లాడుతూ.. సింగరేణి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని కొనియాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే దీనిని దేశంలోనే ఆదర్శ ప్రభుత్వ రంగ సంస్థగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి, వివిధ జిల్లాల, మండలాల నాయకులు, బీఎంఎస్ ప్రతినిధులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# ఆక్రమణలు వదిలి..

## పట్టా భూములపై మున్సిపల్ అధికారుల ప్రతాపం

- కోర్టు స్టే ఆర్డర్లు ఉన్నా పట్టించుకోకుండా ఆస్తుల ధ్వంసం
- న్యాయం చేయకుంటే చావే శరణ్యమంటున్న బాధితుడు మొట్ల రాజిరెడ్డి దంపతులు



అక్షరదర్బార్, నర్సంపేట : ప్రభుత్వ నాలా ఆక్రమణలను వదిలేసి, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు తమ పట్టా భూమి గుండా స్మశాన వాటికకు దారి తీస్తూ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని పత్తి మిల్లు యజమాని మొట్ల రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని తమకు అప్పగించకపోతే చావే శరణ్యమని రాజిరెడ్డి దంపతులు హెచ్చరించారు. నర్సంపేట పట్టణంలోని ద్వారకపేట పక్కన సర్వపురం శివారు 254 సర్వే నెంబర్లలోని తమ పట్టా భూమిలో పత్తి మిల్లు, వే బ్రిడ్జి కాంటా నిర్మించుకుని జీవిస్తున్నామని తెలిపారు. గత నాలుగేళ్లుగా కొంతమంది కావాలనే తమపై పగబట్టి, మున్సిపాలిటీ అధికారులతో కుమ్మక్కై ఈ అన్యాయానికి పాల్పడుతున్నారని బాధితుడు ఆరోపించారు. ఈ వివాదంపై జిల్లా కోర్టు, హైకోర్టుల నుండి స్టే ఆర్డర్లు, ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నప్పటికీ అధికారులు బేఖాతరు చేస్తున్నారన్నారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న తనకు మానసిక అశాంతిని కలిగిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమకు న్యాయం చేయాలని రాజిరెడ్డి వేడుకున్నారు.



**కోర్టు ఆర్డర్లు చూపిస్తున్నా వినడం లేదు.. మాకు చావే శరణ్యం!**

"సర్వపురం శివారు 254 సర్వే నంబర్ల ఉన్న భూమి మా తాత ముత్తాతల కాలం నాటి పట్టా భూమి. ఇందులో పత్తి మిల్లు, వే బ్రిడ్జి కాంటా పెట్టుకుని నిజాయితీగా బతుకుతున్నాం. మా పక్కనే ఉన్న ప్రభుత్వ నాలాను కొందరు ఆక్రమిస్తే అధికారులు పట్టించుకోలేదు. కానీ, కొందరు స్థానిక నాయకులతో కుమ్మక్కై మా పట్టా భూమిని, కోట్లాది రూపాయల ఆస్తులను ధ్వంసం చేయడానికి మున్సిపల్ సిబ్బంది పొక్లెయిన్లతో వచ్చారు. ఈ నాలా గొడవపై జిల్లా కోర్టు, హైకోర్టుల నుండి స్పష్టమైన స్టే ఆర్డర్లు, ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నాయి. ఆ కాగితాలు చూపిస్తున్నా అధికారులు బేఖాతరు చేస్తున్నారు. నాకు గుండె ఆపరేషన్ అయింది. ఈ మనోవేదన తట్టుకోలేకపోతున్నా. అధికారులు ఇలాగే మొండిగా ముందుకెళ్తే మా దంపతులకు చావే శరణ్యం. నా ప్రాణానికి ఏమైనా జరిగితే మున్సిపల్ అధికారులదే పూర్తి బాధ్యత."



# సత్వర న్యాయం అందించాలి

- రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలి
- పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నేర సమీక్ష సమావేశంలో వరంగల్ సీపీ ఎన్ శ్వేత
- రూ.50 లక్షల విలువైన 352 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత



అక్షరదర్బార్, హనుమకొండ: ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తును నిర్వహించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఆదేశించారు. మంగళవారం స్థానిక కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల సమావేశ ప్రాంగణంలో కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆమె నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, నేరాల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిస్థితి, మహిళలు- చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు ట్రాఫిక్ నిర్వహణ వంటి పలు కీలక అంశాలపై సీపీ సమగ్ర సమీక్ష జరిపారు.

### నేరాల అదుపునకు సీపీ దిశానిర్దేశం

పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. చోరీ కేసుల్లో రికవరీ చేసిన సొత్తును చట్టపరమైన ప్రక్రియ అనంతరం త్వరగా బాధితులకు అప్పగించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా పాఠశాలల పరిసరాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి పిటిషన్‌ను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని, డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. భూ వివాదాల కేసుల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లను ఖచ్చితంగా పాటించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి, అవసరమైన చోట రౌడీ షీట్లు తెరవాలని ఆదేశించారు.

### బాధితులకు చేరిన మొబైల్ ఫోన్లు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీకి గురైన, పోగొట్టుకున్న సుమారు రూ.50 లక్షల విలువైన 352 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. మంగళవారం సీపీ శ్వేత ఈ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, ధారా కవిత, రాజమహేంద్రనాయక్, కిషోర్ సింగ్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# అధిక ధరలకు అమ్మితే దుకాణాలు సీజ్

- యూరియా విక్రయాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక
- పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, గణపురం: జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం ఆయన గణపురం మండలంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయ కేంద్రంలోని స్టాక్ బోర్డును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం అక్కడికి వచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో యూరియా సరఫరా ఎలా ఉంది? యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవడంపై రైతులకు అవగాహన ఉందా? లేదా? అని ఆయన ఆరా తీశారు. సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా 'నానో యూరియా'ను వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గత ఏడాది జూలై 14వ తేదీ నాటికి జిల్లాకు ఎంత యూరియా కేటాయించారు? అందులో ఎంత వినియోగం జరిగిందో పూర్తి వివరాలతో కూడిన నివేదికలను వెంటనే సమర్పించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కుమారస్వామి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లు సహకరించాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి
- ఎస్ఐఆర్ ను వేగవంతం చేసే ప్రక్రియపై రేషన్ డీలర్లతో సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి చేయడంలో జిల్లాలోని రేషన్ డీలర్లు సహకరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని హనుమకొండ, కాజీపేట, హసన్ పర్తి మండలాల రేషన్ డీలర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంపై జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ఓటర్లకు గణన ఫారాలను(ఎన్యూమరేషన్ ఫారాల)అందించారని, ఓటర్లు పూరించిన ఫారాలను తిరిగి బీఎల్వోలకు అందించడంలో రేషన్ డీలర్లు సహకరించాలని అన్నారు. తమ పరిధిలో ఉన్న ఓటర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనే విధంగా రేషన్ డీలర్లు సహకరించాలన్నారు. రెండు చోట్ల ఓట్లు కలిగి ఉండడం కూడా చట్ట ప్రకారం తీసుకునే చర్యలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియని జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రమేష్ బాబు, మోహన్, ఆయా మండలాల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# ఇంటింటి జ్వర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- హెచ్‌పీవీ టీకాపై అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



అక్షరదర్బార్, హనుమకొండ : ఇంటింటి జ్వర సర్వే నిర్వహించే సమయంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణ, డ్రైడే నిర్వహణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ. అప్పయ్య సూచించారు. మంగళవారం పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి జ్వర సర్వేను అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజలు ప్రభుత్వ శాఖలతో కలిసి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సందర్శించి, మెప్మా రిసోర్స్ పర్సన్లు, వైద్య సిబ్బంది ద్వారా మహిళలు ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి లష్కర్‌సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకా శిబిరాన్ని పరిశీలించారు. 14 ఏళ్లు నిండిన బాలికలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 30 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకా అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ రాజా హైదర్ తెలిపారు.

కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్‌మోహన్‌రావు, వైద్యాధికారులు డాక్టర్ దీప్తి, డాక్టర్ రాజా హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఖాదర్ అబ్బాస్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.